క్లుప్తంగా

19న వార్డుకు ఉప ఎన్నిక

అంబాజీపేట: మాచవరం పంచాయతీ 13వ వార్డు సభ్యుడు ఆకస్మిక మృతితో ఖాళీగా ఉన్న స్థానానికి 19న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. 8 నుంచి 10వ తేదీ 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. 11న పరిశీలన, 12న అభ్యంతరాలు, 14న నామినేషన్ల ఉప సంహరణ, అదే రోజు తుది జాబితా ప్రచురణ ఉంటాయన్నారు. 19 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం


ముత్యాలమ్మ తల్లి

అంబాజీపేట: నందంపూడిలో వేంచేసిన ముత్యాలమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు కుంకుమ పూజలు, చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు, నైవేద్యాలను చెల్లించి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి జాతరలో ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వచ్చే ఆదివారం అమ్మవారి జలకాన్ని నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: రైతు సంక్షేమం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి చెందాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో ఆర్బీకే చైర్మన్ వాసంశెట్టి వెంకటరమణ అధ్యక్షతన ఆర్బీకేలకు వచ్చిన 225 యూరియా బస్తాలను మంగళవారం రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాల కిట్లను అందజేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని వై.కొత్తపల్లి సర్పంచ్ తోరం వీవీ సత్యనారాయణ అన్నారు. గ్రామ సచివాలయం కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో రైతులకు మంగళవారం ఆయన పీడీఎంఎస్ విత్తనాలను, ఎస్‌టూఎస్ కిట్లను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యయసాయంతో చేనుతో పాటు, మనకు మంచి ఆరోగ్యం సమకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆకుల వీరబాబు, సరెళ్ల సత్యనారాయణ, కడలి విజయకుమారి, గోగి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు అభినందనలు

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న యనమదల నాగేశ్వరరావుకు మండల వైఎస్సార్ వెలుగు సమాఖ్య అభినందనలు తెలియజేసింది. ఏపీఎం ధనరాజు ఆధ్వర్యంలో మహిళ సమాఖ్య, కార్యాలయం బృంద సభ్యులు మంగళవారం మడికిలోని ఏఎంసీ చైర్మన్ యనమదల నివాసానికి వెళ్లారు. పుష్పగుచ్ఛాన్ని, పూల కుండీని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రైతుల అభ్యున్నతికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. వెలుగు సీసీ సీహెచ్ సుబ్బారావు, అకౌంటెంట్ యం.నవీన్ కుమార్, యానిమేటర్లు సీహెచ్ హర్షవర్ధిని, సీహెచ్ పార్వతి, సీహెచ్ దుర్గాదేవి, ఎం.గన్నమ్మ, కె.సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు మూడు నామినేషన్లు

రావులపాలెం: మండలంలోని ఊబలంక గ్రామ పంచాయతీ పరిధిలో మూడో వార్డు మెంబరు కొవ్వూరి రామిరెడ్డి మృతి చెందడంతో ఆకస్మికంగా ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా ఆలమూరు మండలం ఈఓపీఆర్డీ పీఆర్సీ రాజ్‌కుమార్ నియమితులయ్యారు. తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయన్నారు.

చెరువుగట్టుపై శిథిల భవనాలు తొలగించాలి

సఖినేటిపల్లి: అంతర్వేది చెరువు గట్టుకు ఉత్తరం వైపునున్న శిథిల భవనాలు తొలగింపుకు ప్రత్యేక అనుమతి తీసుకురావాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు, స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జేజేఎంలో ప్రస్తుతం చెరువు అభివృద్ధి పనులు సాగుతున్నావని, ఈ తరుణంలో చెరువుగట్టుపై ఉన్న శిథిలమైన వాటర్ ట్యాంకు, సామాజిక భవనం, పంచాయతీరాజ్ భవనం తొలగించి, చెరువు విస్తీర్ణాన్ని మరింత పెంచే విధంగా చూడాలని వారు కోరారు. కాగా శిథిల అంగన్‌వాడీ భవనం తొలగింపునకు ఇప్పటికే అనుమతి ఉన్నదన్నారు. దీనిపై సంతకాలు చేసిన వారిలో ఎంపీటీసీ బైర నాగరాజు, పంచాయతీ వార్డు మెంబర్లు సీహెచ్ వెంకటలక్ష్మి, బి.సత్తిబాబు, వై.ప్రీతి, చొప్పల నరసింహస్వామి, జి.చింటు, కె.త్రివేణి ఉన్నారు.

వరద ప్రభావిత గ్రామాల్లో సీఎం పర్యటన


ముమ్మిడివరం మండలంలో వరద బాధితులనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పినిపే విశ్వరూప్, వేణు, తానేటి వనిత, జోగి రమేష్, ఎమ్మెల్యేలు పొన్నాడ సతీష్, జగ్గిరెడ్డి, చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు


వృద్ధురాలితో మాట్లాడుతున్న సీఎం


రైతులను వరద తెచ్చిన కష్టాలు అడిగి తెలుసుకుంటూ..

వరద బాధితులకు భరోసా

మామిడికుదురు/అయినవిల్లి: గోదావరి వరద ముంపునకు గురైన అయినవిల్లి మండలం కొండుకుదురులంక గ్రామ శివారు తొత్తరమూడివారిపేటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జోగి రమేష్, రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎంపీ చింతా అనురాధ తదితరులతో కలసి సీఎం మంగళవారం అయినవిల్లి మండలంలో పర్యటించి బాధితులకు భరోసా ఇచ్చారు. సుమారు గంట పాటు గ్రామంలో పర్యటించి ప్రభుత్వం నుంచి సహాయం ఏ విధంగా అందింది, అధికారులు ఏ విధంగా పని చేశారు అన్న అంశాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి కోతకు గురవుతున్న లంక భూముల్ని, కోతకు అతి సమీపంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ముంపునకు గురైన ఇళ్లను పరిశీలించారు. గోదావరి తీరంలో ఉన్న శీలం సాయిదేవి, సత్యవతి, వీరవెంకటసత్యనారాయణ, ఝాన్సీ లక్ష్మిలతో మాట్లాడారు. వృద్ధురాలు శీలం ఝాన్సీలక్ష్మి చేయి పట్టుకుని ఆమెతో నడుస్తూ ఆమెకు ప్రభుత్వ సహాయం ఏ విధంగా అందింది అన్న వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అక్కడ జరిగిన సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలతో మమేకమయ్యారు. మండలంలోని కొండుకుదురులంక, శానపల్లిలంక, పొట్టిలంక, వీరవల్లిపాలెం తదితర గ్రామాల్లో నివాస ప్రాంతాల్లో నది కోతకు గురికాకుండా రివిట్‌మెంట్ నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. వేతనాలు పెంచాలని, పింఛన్లు మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని, అర్హులైన వారిని పంచాయతీ కార్యదర్శులుగా, జూనియర్ అసిస్టెంట్లుగా, బిల్ కలెక్టర్లుగా నియమించాలని కోరుతూ యూనియన్ ప్రతినిధులు కె.నాగప్రసాద్, ఏఎస్‌వీఎస్ సాయి, ఆర్.రామారావు, ఎం.శ్రీనుబాబు సీఎంను కలసి విన్నవించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, అంబాజీపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ వాసంశెట్టి వరలక్ష్మి, పార్టీ నాయకులు కొండేటి వికాస్, కొండేటి వెంకటేశ్వరరావు, పినిపే శ్రీకాంత్, మంతెన రవిరాజు, కుడుపూడి భరత్ భూషణ్, మేడిశెట్టి శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గాప్రసాద్, కొనే సునీత సుబ్బలక్ష్మి, గుర్రాల చిట్టిబాబు, మట్టపర్తి రామారావు, గుత్తుల శ్రీరామ్మూర్తి, నక్కా వెంకటేశ్వరరావు, పాలమూరి గోపాల్, పెట్టా జగన్, పులిదిండి ప్రభాకర్, బొంతు రాజేంద్రప్రసాద్, గుమ్మిడి ప్రసాద్, తాటిపాక జోషికుమార్, పొద్దేకు భద్ర, సాధనాల రమేష్, కుడుపూడి రాము, నేతల నాగరాజు, నాగవరపు నాగరాజు, గుత్తుల నాగబాబు, యడ్ల కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో కొందరు లబ్ధిదారులు సీఎంతో ముచ్చటించారు. ఆ వివరాలిలా..

సీఎం జగన్ చల్లగా ఉండాలి



అడిగిన వెంటనే కోర్కెలు తీర్చే దేవుడు సీఎం జగన్. ఆయన చల్లగా ఉండాలి. మా గ్రామంలోని ఇళ్లు నదీకోతకు గురవుతున్నాయి. సీఎం జగన్ ఈ ప్రాంతాన్ని పరిశీలించి కోతకు గురికాకుండా రివిట్‌మెంట్ నిర్మిస్తానని భరోసా ఇచ్చారు. అలాగే వదర బాధితులు అందరికీ సాయం అందించి వారి బాధల్లో నేను ఉన్నానని భరోసా ఇచ్చారు. ఆయన నా ఆయుష్షు కూడా పోసుకుని చల్లగా ఉండాలి.
– శీలం ఝాన్సీలక్ష్మి, కొండుకుదురులంక

ఎంతో సంతోషంగా ఉంది



మీ ప్రభుత్వంలో ఎంతో సంతోషంగా ఉందయ్యా. మీరూ మా గ్రామం వస్తారని కలలో కూడా అనుకోలేదయ్యా. మీరూ ప్రవేశపెట్టిన పథకాలు అద్భుతంగా ఉన్నాయి. మాకు ఎవరికీ మీ ప్రభుత్వంలో లోటు లేదయ్యా. వచ్చే ఎన్నికల్లో కూడా మాకు మీరే సీఎంగా ఉండాలి బాబు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మీరు పంపిన సాయం మాకు అందిందయ్యా. మాకు వరదల సమయంలో ఇంటింటికీ 25 కిలోల బియ్యం, అయిల్ ప్యాకెట్లు ఇలా అన్ని నిత్యావసరాలు అందించారన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు సాయం అందిందన్నా. నీవు చల్లగా ఉండాలన్నారు. ఆనంద భాష్పాలతో నిన్ను ఆశీర్వదిస్తున్నా మరలా మీరే మాకు సీఎం.
– పోతుల భారతి, కొండుకుదురులంకలోని గున్నంమెరక

మీ సేవలు వెలకట్టలేనివి



మాకు మీ ప్రభుత్వ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నా. మా పిల్లల చదువు కోసం ప్రభుత్వం అందిస్తున్నా అమ్మ ఒడి, విద్యాదీవెన సాయం మరువలేనిది. మీకు రుణపడి ఉంటాం, వరదల సమయంలో కోతకు గురవుతున్న లంక భూములను మీరే కాపాడాలన్నారు. వరదల సమయంలో మీ ప్రభుత్వం అందించిన సాయం అందిదయ్యా. మీరు సీఎంగా అందిస్తున్న సేవలు వేలకట్టలేనివి.
– పెట్టా రజని, కొండుకుదురులంక

నిత్యావసరాలు అందాయి



వరదలకు ప్రభుత్వం ఇచ్చిన నిత్యావసరాలు అందాయి. కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, ఆయిల్‌తో పాటు వరదకు మునిగిన ఇళ్లకు రూ.2 వేలు అందించారు. వలంటీర్ల ద్వారా మీరు అందిస్తున్న పథకాలు, సాయం మాకు నేరుగా అందాయి. అమ్మ లాలన, నాన్న దీవెన, సీఎం జగనన్న పాలన మాకు ఎన్నటికీ ఇలానే ఉండాలి.
– నక్కా శ్రీనివాస్, కొండుకుదురులంక

రూ.లక్ష సాయం అందిస్తానన్నారు



మా కుమారుడు జాన్ శామ్యూల్ మూగ, చెముడుతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించే పరిస్థితి మాకు లేదు. రెక్కాడితే డొక్కాడని పరిస్థితి ఈ నేపథ్యంలో సీఎం జగన్‌ని కలిసి సాయం అర్థించాం. మా కుమారుడి వైద్యానికి రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు.
– మదేశ్వరరావు–లోవవేణి, మందపల్లి, కొత్తపేట మండలం

ప్రతి లబ్ధిదారునికీ పథకాలు చేరాలి


అంబాజీపేటలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న సచివాలయం -1ను ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.సత్యనారాయణలు మంగళవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే లబ్ధిదారులకు ఉద్యోగులు సహకరించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయంలో సాయంత్రం నిర్వహించే స్పందనకు వచ్చిన దరఖాస్తుల వివరాలను నమోదు చేయడంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ విద్యార్థులు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్‌ను, ఆయాను అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్నారికీ, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కేంద్రానికి వచ్చే చిన్నారులకు ఆటపాటలతో పాఠాలు బోధించాలన్నారు.

బ్రహ్మాస్త్రంతో చీడపీడల నివారణ

అంబాజీపేట: పంటలను పట్టి పీడిస్తూ దిగుబడులకు నష్టం కల్గిస్తున్న చీడపీడలను బ్రహ్మాస్త్రంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ జనుపల్లి నాగవేణి అన్నారు. ముక్కామలలో బ్రహ్మాస్త్రం తయారీ విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నాగవేణి మాట్లాడుతూ ఉమ్మెత్త ఆకు 5 కేజీలు, జామ 5 కేజీలు, సీతాఫలం ఆకు 5 కేజీలు, బొప్పాయి ఆకు 5 కేజీలు, వేపాకు 5 కేజీలు సేకరించాలన్నారు. ఈ ఆకులు అన్ని విడివిడిగా దంచి 70 లీటర్ల చేసి, ఆవు మూత్రంలో వేసి 5 పొంగులు వచ్చే వరకు ఉడికించాలన్నారు. ఇలా తయారు అయిన ఈ కషాయాన్ని 48 గంటల తర్వాత వాడుకోవాలన్నారు. ఒక ఎకరానికి 5 లీటర్ల చొప్పున 100 లీటర్ల నీటితో కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. ఇలా స్ప్రే చేయడం వలన పంటపై ఆశించిన పురుగులు, గొంగళి పురుగులు, కాండం తొలచు పురుగు, కాయ తొలచు పురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ముక్కామల ఐసీఆర్పీ కొప్పిశెట్టి మల్లీశ్వరి, జి. పల్లయ్య, ఎస్‌జీహెచ్ మహిళలు, రైతులు పాల్గొన్నారు.

లారీ టైరు పేలి అంటుకున్న మంటలు


మంటలను అదుపు చేస్తున్న ఫైర్, హైవే సిబ్బంది

రావులపాలెం: జాతీయ రహదారిపై వెళుతున్న ఒక లారీ వెనుక టైరుపేలి మంటలు అంటుకున్నాయి. స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కలకత్తా నుంచి చెన్నై వెళుతున్న కూలింగ్ కంటైనర్ లారీ జూనియర్ కళాశాల జంక్షన్ వద్దకు వచ్చే సరికి వెనుక ఎడమవైపు ఉన్న టైరు పేలడంతో లారీ డ్రైవర్ బండిని పక్కన ఉన్న సర్వీసు రోడ్డులో ఆపాడు. ఇంతలో ఆ టైర్లకు మంటలు అంటుకోవడవంతో స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన ప్రాంతానికి చేరుకుని టైర్లకు అంటుకున్న మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 వేల వరకూ నష్టం జరిగినట్టు ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ తెలిపారు.

గద్దర్ సేవలు చిరస్మరణీయం


గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాజోలు: ప్రజా గాయకుడు, కవి, రచయిత గద్దర్ సేవలు చిరస్మరణీయమని పలు ప్రజాసంఘాల నాయకులు అన్నారు. మంగళవారం రాజోలు అంబేడ్కర్ భవనం వద్ద గద్దర్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎం రాష్ట్ర నాయకుడు దీపాటి శివప్రసాద్ మాట్లాడుతూ అణగారిన జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక ఉద్యమాలు చేశారన్నారు. దళిత గిరిజ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలకపాటి శ్రీధర్, న్యాయవాది దేవ రాజేంద్రప్రసాద్, గొల్లమండల నాగేంద్ర, మట్టా ఏడుకొండలు, గోగి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నా భూమి–నా దేశం'

ఐ.పోలవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి 15 వరకూ 'నా భూమి–నా దేశం' 'నేల తల్లికి వందనం–వీరులకు వందనం' ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలని ఎంపీడీఓ డి.రాంబాబు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు.

యానాం: యానాం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 15 వరకూ 'నా భూమి – నా దేశం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రకాశం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో మా తెలుగుతల్లికి మల్లెపూదండ, లైటింగ్ ఆఫ్ ల్యాంప్, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతుల మీదుగా శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 10న ప్రతిజ్ఞ, 11న మొక్కల నాటడం, 14న స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు సత్కారం, 15న జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

మామిడికుదురు: లూటుకుర్రులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.50 లక్షలతో నిర్మించనున్న రెండు సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణానికి స్థానిక సర్పంచ్ అడబాల తాతకాపు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో మారుమూల ప్రాంతాల్లో సైతం పక్కా సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. పాడైపోయిన ప్రతి ఒక్క రోడ్డును ఆధునీకరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, వార్డు సభ్యుడు అడబాల ఆంజనేయులు, బోనం అబ్బులు, పాలూరి పెద్దిరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం వేగివారిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ పప్పొప్పుల వెంకటలక్ష్మి, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ఆత్రేయపురం: మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన గుళ్లపల్లి సుబ్బారావు (70) ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 4న గుళ్లపల్లి సుబ్బారావు ఇంటి నుంచి వెళ్లేటప్పుడు ఇంటిలో ఉన్న బంగారం కూడా తీసుకువెళ్లినట్లు కుమారుడు ప్రసాదరావు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

43 మందికి కంటి పరీక్షలు

పి.గన్నవరం: మండలంలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది 43 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 12 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించారు. కార్యక్రమానికి హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యం వహించారు.

దేవాలయాల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలి

ఆత్రేయపురం: కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులకు వృత్తి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నాయీబ్రాహ్మణ మండల అధ్యక్షుడు పెరవలి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక లొల్లలాకుల వద్ద మండల నాయీబ్రాహ్మణ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులకు న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు, కామవరపు శ్రీదేవి, ర్యాలి లోవరాజు, పసుపులేటి రామకృష్ణ, కంతేటి నాగవెంకట సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే లక్ష్యం


కేశవదాసుపాలెంలో గర్భిణులకు పోషణ కిట్లు అందించిన సర్పంచ్ సరోజ

అంబాజీపేట: గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ నెల్లి ఏడుకొండలు అన్నారు. గంగలకుర్రులో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కేవీఎస్ మహాలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా పొందాలన్నారు. తద్వారా వారి సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యవేణి, వైద్యాధికారి బి.శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ దొమ్మేటి నాగన్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో..

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం తుఫాను భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణ/లు, బాలింతలకు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ (టేక్ హోం రేషన్) పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ మేడిది సరోజ మంగళవారం ప్రారంభించారు. ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి, ఎంపీటీసీ ఉండపల్లి సాయికుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రకళ, మున్నీసా, క్రాంతికుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఉండపల్లి అంజి పాల్గొన్నారు.

పొదలాడలో..

రాజోలు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్) కిట్లను మంగళవారం పొదలాడలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేశారు. రాజోలు ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ జి.సరస్వతి ఆధ్వర్యంలో సర్పంచ్ కడలి సత్యనారాయణ కిట్లు అందజేశారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, పుట్టబోయే శిశువు ఆరోగ్యం, గర్భిణుల్లో పౌష్టికాహారం లోపాలు నివారించేందుకు టీహెచ్ఆర్ ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విలసవిల్లిలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులకు సర్పంచ్ ఊర్మిళాదేవి మంగళవారం అందజేశారు. కార్యక్రమలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, సవరపు మీరాబాయి, పెట్ట బాలామణి, కొమ్మాబత్తుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

అల్లవరం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ కేవీఎల్‌డీ కుమారి అన్నారు. సర్పంచ్‌లు బర్రే సీతారత్నం, తోట శ్రీదేవి, తిక్కిరెడి శ్రీనివాసరావు, రొక్కాల విజయలక్ష్మిల అధ్యక్షతన బెండమూర్లంక, గోడి, ఎంట్రుకోన, బోడసకుర్రు గ్రామాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించి పండ్లు, చీరలు, వైఎస్సార్ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కాండ్రేగుల వాణి అచ్యుతం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయభారతి, ఉన్నీషా, కుమారి, అడపా శ్రీను, జిలి రాధాకృష్ణ, తోట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పోషకాహారంపై శిక్షణ


కేశవదాసుపాలెంలో పోషకాహారంపై సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో రమాదేవి

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం తుఫాను షెల్టర్‌లో మంగళవారం ఓఎన్జీసీ సహకారంతో సిటిజన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లు కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు ఆరోగ్యం, పోషకాహారంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. స్థానిక సర్పంచ్ మేడిది సరోజ అధ్యక్షతన జరిగిన పై కార్యక్రమాన్ని సిటిజన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.రమేష్ పర్యవేక్షించారు. కుక్ ప్లాంటేషన్ ద్వారా ఆకుకూరలు, కూరగాయలు పండించి, తద్వారా పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు స్వచ్ఛమైన ఆహారం అందించే విధంగాను, పలు అంగన్‌వాడీ సెంటర్లకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు రమేష్ అన్నారు. అలాగే ఆరోగ్యం, పోషకాహారం అంశాలపై ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. డాక్టర్ యునస్, ఎంపీటీసీ ఉండపల్లి సాయికుమారి, సిటిజన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ టి.రమాదేవి, కార్యదర్శి డి.సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రహదారిపై రాష్ట్రపతి కాన్వాయ్‌కు సడన్ బ్రేక్

యానాం: పుదుచ్చేరి పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము రహదారిపై తన కాన్వాయ్‌ని ఆపించి కారు దిగి తన కోసం వేచి చూస్తున్న చిన్నారుల వద్దకు వెళ్లి చాక్లెట్లను అందించిన ఘటన అందరినీ అబ్బురపరిచింది. మంగళవారం తిరుకంచి వద్ద దర్శనం చేసుకుని తిరిగి వెళుతుండగా అభిషేకపాకం వద్దకు వచ్చేసరికి రాష్ట్రపతి కారుకు సడన్ బ్రేక్ పడింది. దీంతో ఏం జరిగిందోనని భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఇంతలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కారు దిగి రోడ్డుపక్కన ఉన్న చిన్నారుల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించి చాక్లెట్లు అందజేయడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు.